# ఏకాకి



*ప్రేమించిన హృదయం శంకిస్తుంది. అయినా ప్రేమ సఫలం కావచ్చు, అదృష్టం అనుకూలిస్తే. ప్రేమనే శంకించితే? ఏమౌతుందో చెప్పడం సాధ్యంకాదు, మరి.*

**ఒంటరితనమంత** నరకమూ, శిక్షా ఇంకొకటి లేదు. ఎంత విరక్తికమైనదీ, నిస్సారమైనదీ ఏకాకి బ్రతుకు! భగవాన్, ఎవరినీ ఈ లోకంలో ఏకాకిగా చేయకు —

ఏదో ఆలోచిస్తూ — అప్రయత్నంగా ఒక కన్నీటిచుక్క చెంపమీదుగా జారింది. ఏమిటో! అన్నీ మనం అనుకున్నట్టుగా జరుగుతాయా? చిన్నప్పటినుండి నాకు ఒంటరిగా ఉండటమంటే భయం. పసిపిల్లవాడుగా ఉన్నప్పుడు ఎప్పుడూ అమ్మ చీర చెరగు వదిలేవాణ్ణి కాదట. స్కూలుకు వెళుతున్నప్పుడూ అంతే. ప్రక్కింటి వెంకూ బయల్దేరితేనే, నేనూ బయల్దేరటం. మీరు నన్ను పిరికివాడు అనండి, ఇంకేమైనా అనండి— ఇదిమాత్రం నిజం. కొందరికి ఏకాంతంగా ఉంటే, ఎంతో హాయిగా ప్రశాంతంగా ఉంటుందట. మా తాతగారు అంటూ ఉండేవారు, కోపం వచ్చినప్పుడు—'అబ్బా! ఒక్క క్షణంకూడా నన్ను ప్రశాంతంగా, ఒంటరిగా ఉండనివ్వరుకదా? శాంతి లేదు. ఏం కావలసినా నా దగ్గరకే రావటం' అని. నేనుమాత్రం ఎప్పుడూ ఎవరితో ఒకరితో తుళ్ళుతూ, పేలుతూ, సరదాగా నవ్వుతూగడపటమంటే ఎంతో ఇష్టపడేవాణ్ణి. ఇష్టమేమిటే, ఒక్కడినీ ఉంటే అసలేం తోచదు.

నాతోపాటు ఎవరో ఒకరు ఉండాలి, ఎప్పుడూ. నేను అసలే పేలుడుకాయను. అదీకాక, మనలో

'విజయప్రియ'

నవ్వించేశక్తి ఉంటే, చక్కగా మాట్లాడగలిగితే, అవతలి వ్యక్తి ఎవరైనా, ఎటువంటి 'మూడ్'లో ఉన్నా ఫర్వాలేదని నా నమ్మకం. అయితే ఈ నమ్మకం ఇంతవరకూ వెడలేదు — ఒకటి రెండు సార్లు విరుద్ధంగా జరిగినా. కాని — ఇప్పుడో?

మా ఊరిలో హైస్కూలు చదువైపోయి, కాలేజీలో చేరటానికి '....పట్నం' వెళ్ళాను. కాలేజీ చదువుమీద శ్రద్ధకంటె, 'కాలేజీ లైఫ్' అంటే కులాసా జీవితం — అన్న అభిప్రాయం తోనే చేరాను. కాలేజీలో చేరటానికి వెళ్లినపుడు నాతో మా నాన్నగారుకూడా వచ్చారు. ఆ నాలుగు రోజులూ నాతో — శ్రద్ధగా చదవాలని, బుద్ధిగా ఉండాలని—కనీసం వందసార్లు చెప్పారు. హాస్టల్‌లో అయితే ఎంతసేపూ స్నేహితులతోనే గడిపేస్తాను, చదవను అని అభిప్రాయపడి మామయ్య (వరసకు) ఇంట్లో ఉంచారు.

ఇంట్లోవాళ్ళు మొదటిరోజునే నన్ను హడలగొట్టారు. పిన్నమ్మ (మామయ్య వాళ్ల చెల్లి) కాఫీ తీసుకొస్తూనే — 'చూడటానికి ఉత్త గాంధావతారంలా ఉన్నాడు. నాలుగు రోజులు పోయాక రంగు తేలుతుంది' అన్నది బిగ్గరగా. ఆ మాటలకు, వాటిలోని నిజానికి ఆశ్చర్యపోయాను. అంతలోనే ఆమె ప్రారంభించింది — 'కాఫీ తీసుకోక, అలా మిడిగుడ్లేసుకు చూస్తావేమిరా' అని. కాఫీ అందుకొని ఆమె చనువుకు, మాటలకు ఇంకా ఆశ్చర్యం తీరక, ఏదో ఆలోచిస్తున్నా. వాళ్లింటికి అంతకుముందు చిన్నప్పుడెప్పుడో వచ్చానొకసారి. అప్పుడే వాళ్ళు నాకు 'తోకబ్బాయి' అని బిరుదు ప్రసాదించారు. అది ఒక్కరోజే. అంతే. ఆ తర్వాత ఎప్పుడూ రాలేదు. కాని ఇంట్లో అందరూ నాతో చాలా పరిచయం ఉన్నవాళ్లలా మాట్లాడేస్తున్నారు. మా నాన్నగారుకూడా ఏవో ఛెణుకులు విసురుతూ నవ్విస్తున్నారు. ఇంతలోనే ఇంకో బాంబు పేలింది. పేల్చిన వ్యక్తి అత్త. నాకు ఆవిడ ఏమైనా సరే, ఇంట్లో అందరిలాగే ఆమెను నేనుకూడ 'అత్తా' అనే పిలుస్తాను. 'ఎవడే, వీడూ! మన తోకబ్బాయి కదూటే! ఎంతవాడయిపోయాడే! ఇక్కడ కాలేజీ చదువుకొచ్చాడేమిటి?' అదీ బాంబు.

## గమనిక

*నాగపూర్ ఆంధ్రవిద్యార్థి సంఘం ఈ ఏడాది నిర్వహించిన కథల పోటీలో మొదటి బహుమతి పొందినది 'ఏకాకి'. ఆంధ్ర విద్యార్థి సంఘాన్ని అభినందిస్తూ, ఈ కథను ప్రచురించడానికి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞత తెలియబరుచుతున్నాము.*

—ఎడిటర్

వాళ్ల ఇల్లుచూస్తే పూర్వం రాజుల వైభవాలూ, మొగలాయీల దర్బారులూ గుర్తు వస్తాయి. ఆయన వీధిలోకి వెస్తే, అందరూ సావిట్లో సభ ప్రారంభిస్తారు. 'ముగురాడువారు కూడిన' అన్నారెవరో — ఇక పదిమంది కూడితే చెప్పాలా?

బయటకు వచ్చి, కుర్చీలో కూర్చున్నా — వాళ్ళ మాటల్లో మునిగారని తెలిసి. కాని మళ్లీ బాధ. ఒంటరిగా ఉండటం నా లక్షణం కాదని చెప్పా. 'ఎవరైనా దొరుకుతారా' అని చూస్తున్నా. ఇంతట్లో — వాళ్లింట్లో గుమాస్తా అట — ఒకాయన వచ్చాడు. గిరజాల్తూ, పెద్ద పెద్ద గుడ్లూ, అచ్చం సినిమాలో విలన్‌లా ఉన్నాడు— ముసలాయనైనా. నాకెందుకో ఆయనతో మాట్లాడాలనిపించలేదు. కాని ఆయనే ఆశీర్వదించేసి వెళ్లిపోయాడు — 'ఇక్కడ చదువుకి వచ్చావా, నాయనా! అయితే ఇహ బాగుపడినట్టే!' చెప్పద్దూ! నాకు భలే కోపం వచ్చింది ఆయన మీద. ఆ గిరజాలు కత్తిరించేసి, నున్నగా గుండు కొట్టించేయాలి నున్ని ఉండలాగ—అనిపించింది. ఇంతలో మామయ్య తమ్ముడు వచ్చాడు. వాడు ఫోర్తుఫారమ్ చదివాడట. కాని ఆ ఏడాదిపోయింది. ఇద్దరం వీధిలోకి బయల్దేరి, ఒంటిగంటకు వెళ్లినవాళ్లం రాత్రి ఏడింటికి ఇంటికివచ్చాం. ఎన్ని సంగతులు చెప్పాడు నాకు! కాలేజీలో పాఠాలు ఎవరూ వినరట. వెనక బెంచీలో కూచొని చుక్కలాట ఆడతారట. రీడింగ్‌రూమ్‌లోకి డిటెక్టివ్ పుస్తకాలు తెచ్చుకొని చదువుతారట. లెక్చరర్లనూ, అమ్మాయిలనూ పేర్లుపెట్టి ఏడిపిస్తారట. ఎన్నెన్నో చెప్పాడు. వాడిమీద నాకెందుకో ఒక విధమయిన భావం ఏర్పడింది.

పిన్నిగారు అన్నట్లే నాలుగు రోజులూ అయాయి. నా రంగూ బయట పడింది. ఎలా పోయిందో తెలియదు; నా భయంపోయింది. అందరితో చనువుగా, హుషారుగా మాట్లాడుతూ ఉండేవాణ్ణి. 'అచ్చం వాళ్ల నాన్నేనే. వాళ్ల నాన్నా ఇక్కడికి వచ్చినపుడు ఇలాగే ఉన్నాడా — సరి, నాలుగు రోజులయాక ఇల్లంతా వాడిదే' అని అంటూంటే నాకెందుకో సంతోషంగా ఉండేది.

కాలేజీలోనూ అంతే. మొదటిరోజునే లెక్చరర్ హడలగొట్టాడు — అటెండెన్సు పలికాక 'ఏమిటోయ్, ఇన్ని 'ఏ'లున్నాయ్! నీ పూర్తి పేరేమిటి?' అని. అడిగిందేనా తెలుగులో అడగరాదూ? నేను గాభరాపడి ఏదో గొణిగాను. క్లాసంతా గొల్లుమన్నారు. కాని నాలుగు రోజులయాక, క్లాసంతా నా స్నేహితులే. ఒక్క మా క్లాసేమిటి, కాలేజీ లోనే చాలామంది స్నేహితులు. మొదటిరోజున లోపల బనియను లేకుండా ఉత్త చొక్కా వేసుకుని (నిక్కరే; పాంటు కాదు) వెళ్లాను. ఫైనల్ బియ్యే వాళ్లట. గర్ల్సు రూమ్‌కు ఎదురుగా నిలబడ్డారు, మహాయోధుల్లా. 'తమ్ముడూ! ఇలా రా!' అని నన్ను ఎంతో ఆప్యాయంగా పిలిచాడు ఒకతను. దగ్గరికి వచ్చాక 'చూశావా,


ఉండండి

ో పాల్గొనండి



్య ఒరుపుడు
ము పగుళ్ళు
జంగా వుండే
పించటంవల్ల
న్నవి

మడమ పగుళ్ళు లిచెన్‌సా వల్ల
సా చర్మానికి పోషణ ఇస్తుంది.
దేళ్లు గుణమిస్తుంది.




సాకు శీఘ్రంగా లొంగుతవి
వాడి చూడండి

DZ 1613 TG

# ఏకాకి

కాలేజీలో నిక్కరేసుకోకూడదు. పాంటు వేసుకుని టక్ చెయ్యి. నువ్వు పొడుగ్గా లేకపోయినా ఫర్వాలేదు. ఏం? ఈ చొక్కాకి మొదటిగుండీ పెట్టకూడదు, మరీ బుద్ధిమంతుడిలాగా — స్టైలుగా అలా వదిలేయాలి' అని తనే గుండీ తీసేశాడు. ఇంతవరకూ నిజమే అనుకొని ఊకొడుతూ తలూపుతున్నా. 'పాపం! తమ్ముడికి బనియను లేదురా. మనమంతా చందావేదాం' అన్నాడు. అందరూ గొల్లుమన్నారు. నాలుగు రోజులు పోయాక ఆ అబ్బాయి నా స్నేహితుడే.

ఏమిటో! ఈ జ్ఞాపకాలవే కాలం మానవ మస్తిష్కంపై వేసిన ముద్రలు — ఎంత విచిత్రమయినవి! ఎంత విచారంలో ఉన్నా ఏవో పాత స్మృతులు జ్ఞప్తికి వచ్చి, కాస్సేపు మనలను ఏవో లోకాల్లోకి తీసుకుపోతాయి. ఎటువంటి జ్ఞాపకాలయినా మధురంగానే ఉంటాయి.

అబ్బ! దాహం వేస్తోంది. టైమెంతయిందో — వాచీ ఎప్పుడో ఆగిపోయినట్లుంది. మంచినీళ్ళు త్రాగివచ్చి, మళ్ళీ కుర్చీలో కూర్చున్నా. ఇప్పుడేం చేయాలో తోచటంలేదు. ఈ ఒంటరితనం భరించడమెలాగ? ఎలాగ? ప్రస్తుతానికి ఒకటే మార్గం కనిపిస్తోంది. వర్తమానం శూన్యమయితే, గతాన్ని తలుచుకొని, భవిష్యత్తులో—? వద్దు. ఇంకేం భవిష్యత్తు? అంతా గతమే.

వీధిలో బత్తాయి పళ్ళవాడు పోతున్నాడు. పోనీ వాణ్ణి కేకవేద్దాం; కాస్సేపు సంభాషణలో పడితే, కొంచెమైనా ఉపశాంతి దొరుకుతుంది— అనుకొని పిలిచాను. బేరమాడకుండానే ఓ నాలుగు తీసుకొని, నెమ్మదిగా సంభాషణలో దింపాను. ఇక్కడికి రెండు మైళ్లట వాళ్ల ఊరు. రోజల్లా తిరిగితే ఒకటీ రెండూ దొరుకుతాయట. ఎవరిదో తోటకు రాత్రీ పగలూ కాపు ఉండి అమ్ముకొని లాభం వస్తే తీసుకోవటం. యజమానికి తోట కాపలాకు రాకముందే డబ్బు ఒప్పందమట.

"సెలవు బాబు. సందెవేళ కాకముందే నాలుగు వీధులూ తిరిగితే ఏదన్నా—" అని వెళ్లిపోయాడు.

కాలేజీ రోజుల్లో మాత్రం ఇలా ఎవడూ వెళ్లిపోలేదు. అందరూ నాతో మాట్లాడటానికి ఇష్టపడేవారే — ఎవరో ప్రసాదులాంటివాళ్ళు తప్ప. ప్రసాదు చిత్రమయిన వ్యక్తి. అసలు ఎవరితోనూ మాటలాడడు, ఎప్పుడో ఎంతో అవసరమయితేనే తప్ప. కాలేజీలో నేనూ చాల మంది లాగే పుస్తకాలు తీయటం మాని, స్నేహితులతో సరదాగా గడిపేవాణ్ణి. ఇది మంచిది కాదని తెలిసినా, చెడుపని మాత్రం కాదని నమ్మకం ఉండేది. ఆఖరికి అమ్మాయిలను ఏడిపించడంలోకూడా మనం ఫస్టే. హైస్కూల్లో చదువుతున్నప్పుడు పిచ్చిగారంతేసివాళ్ళు ఉండే వాళ్ళు ఎస్సెస్సెల్సీలో. ఒకసారి ఒకామెకు నామీద

కోపంవచ్చి నా చెయ్యి పట్టుకొని 'హెడ్‌మాస్టారి దగ్గరికి పద' అంది. అంతే! మరి గుండెల్లేవు. చెయ్యి విడిపించుకొని, పరుగు లంకించుకొన్నా, వెనకాతల నవ్వు వినిపిస్తున్నా. అలాటిది, కాలేజీలో భయంలేదు సరికదా — గోల చెయ్యడ ముమ్మా. అలా అని మరీ విర్రవీగిపోవటం కాదు. తెలుగు లెక్చరర్ అన్నట్టు తెలివైన పెంకితనం నాది.

మొదటి సంవత్సరం అయిపోయింది. రెండో సంవత్సరంలో మామయ్యా వాళ్లింట్లో ఉండటం చికాకు అనిపించింది. నాకోసం స్నేహితులెవరు వచ్చినా విసుక్కునేవాళ్లు. నేమా ఆ 'ఫ్రేమ్'లో ఇరకలేకపోయాను. వాళ్ల ఇంటిలో చదువుకూడా సరిగా సాగేదికాదు. ఆ దర్బార్లో ఎప్పుడూ సభలే. ఆ శబ్దప్రవాహంలో మనం చదివేది బుర్రలోకి ఎక్కే దెలాగ? వేరే ఏదన్నా గది చూడాలని ఉండేది. కాని అక్కడినుండి బయట పడడ మెలాగో తెలిసింది కాదు. తీరా తెలిసేసరికి మూడేళ్ళు గడిచిపోయాయి — బియ్యే ఆఖరి ఏడాది ప్రారంభం. రూమ్‌మేట్‌కూడ ఎంతో మంచివాడు. ఎప్పుడూ హుషారుగా ఉండేవాడు. కథలుకూడా వ్రాసేవాడు.

ఆ ఆఖరి ఏడాదే నా జీవితపథాన్ని మార్చేసింది. చాలా చిత్రమయిన పరిస్థితుల్లో తలవని తలంపుగా పరిచయమైంది — శ్యామలతో. శ్యామల నాకంటెకూడ ఎంతో చక్కగా మాట్లాడేది. ఒక్కోసారి ఆమె మాటల తీరుకు, కంఠంలో చిలిపితనంతో కూడిన మాధుర్యానికీ ఆశ్చర్యపోయి, అలా మౌనంగా ఉండేవాణ్ణి. ఒకటి రెండు సార్లు ఆమే అడిగేసింది — 'కాలేజీలో అంత గొడవ చేస్తారు కదా? మరి నాముందరేం బొమ్మలా విల్చుంటారు?'—అని. ఆ ప్రశ్నకు జవాబు ఆమెకు తెలుసు. అయినా నా నోటివెంట చెప్పించాలని కాబోలు ఆమె ప్రయత్నం.

'బాబూజీ' అని ఎవరో పిలిస్తే కిటికీలో నుండి చూశాను. ఎవరో పిచ్చివాడులా ఉన్నాడు. తనమీద, బట్టలమీద — అసలు దేనిమీదా శ్రద్ధలేనట్టు కనిపించాడు. నేను కిటికీ దగ్గరకు రాగానే, అతనూ వచ్చాడు. కాస్సేపు నావేపు తదేకంగా చూసి బిగ్గరగా నవ్వాడు. 'బాబూజీ, మీరు కటకటాలలో ఉన్నారు' అన్నాడు. ఒక్క క్షణం స్తబ్దుగా ఉండిపోయాను. కాస్సేపు ఆగి 'లేదు. నేనే జైలులో ఉన్నాను. ఈ ప్రపంచమే ఒహ పెద్ద జైలు' అన్నాడు. పిచ్చివాడయినా ఎంత తెలివిగా మాట్లాడుతున్నాడు! 'మీ మతి స్థిమితంగా లేదు. అవునా? హిహి....' అని వెళ్లిపోయాడు. ఈ మాటల ప్రభావం ఏమిటా? అని ఆలోచిస్తున్నా. పిచ్చివాళ్ల మాటలు, చేతలు చాలా విచిత్రంగా ఉంటాయి. గాంధీగారు ఒకసారి పిచ్చాసుపత్రి చూడటానికి వెళ్ళారు. అక్కడ ఒకతనికి తను మహాత్ముడని పరిచయం చెయ్యబడ్డారు. అతను అన్నాడుకదా — 'సరే. దాని కేముంది? అది పోతుందిలే త్వరలోనే. నువ్వు మహాత్ముడవే కాని, నేను ఇక్కడికి వచ్చినపుడు బుద్ధభగవానుణ్ణి తెలుసా?' — అని.

ఈ 'పిచ్చివాడు' అన్న శబ్దం నాగురించికూడ ఒకటి రెండు సార్లు అన్నారు. శ్యామల కనిపించని రోజున, నా మాటలు చేతలు అలాగే కనిపించేవి కాబోలు. 'ఏమిటిరా, అలాంటి రంభ ఇంకెక్కడా దొరకదనీ, మరీ ఇదయిపోతున్నాడు' అనేవారు. నిజమే. శ్యామల అందగత్తె కాదు. పేరుకు తగ్గట్టే శ్యామల వర్ణంలోనే ఉంటుంది. అయితేనేం? రూపసి. ఆ కళ్లలో కాంతీ, ఆ పెదవులపై చిరుదరహాసమూ చాలు. కోటీశ్వర్గాల వైభవం. తేటనీటిలో పిల్లగాలుల తాకిడికి తరంగాలు లేచినపుడు, నిండు పున్నమి జాబిలి ప్రతిబింబం తళతళలు ఆమె కళ్లలో చూడవచ్చు. ఒక్క కళ్ల లోనే ఇన్ని అందాలు సృజించిన సృష్టికర్త



జీ వ న సం ధ్య

ఫొటో—ఎల్. ఆర్. గ్రోవర్ (రొహతక్)

రచనా చాతురికి ఎవరైనా ఆశ్చర్యపోక తప్పదు. ఎన్నోసార్లు ఆమెతో చెప్పాలనుకున్నాను— 'నీవులేని నేను లేనని'. కాని, ఆ ఒక్కమాటే చెప్పలేకపోయాను. ఆమెపై ఏ భావముందో, ఆమెను ప్రేమిస్తున్నానా, ఆమెను ప్రేమిస్తున్నానన్న భావాన్ని ప్రేమిస్తున్నానా—అని తెలుసుకోలేని రోజులవి. అందుచేతనేనేమో అడగలేకపోయాను. ఏమైనా ఆమెలేని లోటు ఇప్పుడు తెలుస్తూంది.

మా పరీక్ష లయిపోయినా, ఇంకా వాళ్లకు అవుతున్నాయి. కేవలం ఆమెను చూడటంకోసమే కాలేజీకి వెళ్లేవాడిని. సెలవులకు ఇంటికి వెళ్ళే ముందు ఒక్కసారి తన దగ్గరకు వచ్చి వెళ్ల మన్నాడు బాబాయి. బాబాయీ వాళ్ల ఊరు అక్కడికి పదిమైళ్లు. మధ్యన ఆదివారం వచ్చింది కదా అని అక్కడికి వెళ్లాను. అలా వెళ్ల కుండా ఉంటేనే బాగుండేదేమో? బాబాయి బలవంతంచేత నాలుగురోజులు ఉంచేసేశాడు నన్ను— సెలవులేకదా అని. అందుకే ఆఖరిరోజున శ్యామలను కలియలేకపోయాను, ఆఖరిబస్సు అందకుండా పోయినవాడిలాగ. ఆ తరువాత మరి శ్యామలను కలియలేదు. మామధ్య ఉత్తరాలూ లేవు, ఒక్క ఆమె శుభలేఖ తప్ప. అదీ ఆమె పెళ్లి అయిపోయిన నాలుగోరోజున వచ్చింది. ఆ శుభలేఖతోపాటు ఇంకోలేఖ కూడ ఉంది. అది శ్యామల వ్రాసింది.

"....

ఉత్సాహంతో ఉరకలు వేస్తూ, పరుగులు తీస్తున్న ప్రవాహాన్ని ఆనకట్టవేసి, బలవంతంగా గమనమార్గాన్ని మరోవైపుకు మరలిస్తే, ప్రవాహం లొంగిపోక చేసేదేముంది? చేజారిన కాలంగూర్చి చింతిస్తూ కూర్చోక, సజీవమైన వర్తమానాన్ని ఫలవంతం చేసుకోవటమే ఉత్తమ మార్గం కదూ? ఇంతకంటె ఇంకేం వ్రాయను?

నీ శుభాశీస్సులు కోరే,
శ్యామల."

అప్పటినుండే ఎన్నడూలేని ఈ ఒంటరితనం. దేనిమీదా శ్రద్ధలేదు. ఏదో యాంత్రికంగా పనిచేసుకుపోవటం — ఆఫీసు, మెస్సు, రూము — ఇదే జీవితం అయిపోయింది. ఎప్పుడైనా శాంతి కలిగించేది ఏదైనా ఉంటే, అది ఒక మహాకవి రచన. ఎన్నాళ్లో ఇలా ఏకాకిగా—

ఆలోచనల్లో మునిగి ఎప్పుడు చీకటి ముసురుకున్నదో కూడ గమనించలేదు. ఆకాశంలో మెరవడం మానుకున్న ఒకే ఒక నక్షత్రం కాంతివిహీనంగా ఉంది. ★